క్లుప్తంగా

ఎస్పీకి ధన్యవాదాలు తెలిపిన బాలుడి తల్లిదండ్రులు



బాలుడిని ఎత్తుకున్న ఎస్పీ

నల్లగొండ : ఇటీవల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నాప్‌కు గురైన 20 నెలల బాలుడిని పోలీసులు ఆచూకీ కాపాడి బాలుడి తల్లిదండ్రులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆ బాలుడి తల్లిదండ్రులు పోలీసులు కొడుకును కాపాడి తమకు అప్పగించినందుకు ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

మునుగోడు : ప్రభుత్వం అందించనున్న రైతు భరోసాకు నూతనంగా పట్టా వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ కోరారు. తమ పట్టాపాస్ పుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లు తమ క్లస్టర్ ఏఈఓకు అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. **కేతేపల్లి** : నూతనంగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు వానాకాలం రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార కార్డు, బ్యాంకు సేవింగ్ ఖాతా జిరాక్స్ ప్రతులను దరఖాస్తుకు జతచేసి ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలని సూచించారు. గతంలో రైతు భరోసా పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి(నల్లగొండ) : టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో యువ పరివర్తన ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఏరియా మేనేజర్ మునేష్, శ్రీశైలం, కావ్య శ్రీ, అరుంధతి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న గంగధర్‌రావు

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారణాసి రాములు మృతి చెందాడరు. శనివారం బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగధర్‌రావు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో స్థానిక నాయకులు గునగంటి సురేశ్, దోరేపల్లి మల్లయ్య, కందికంటి రమేశ్, కొప్పుల వెంకన్న, తుమ్మల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేతేపల్లి : కట్టంగూర్‌లో నిర్వహిస్తున్న కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంటిపాక కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కేతేపల్లిలో కేవీపీఎస్ శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు వంగూరి వెంకన్న, మండల నాయకులు పెరిక మల్లయ్య, రవితేజ, స్టాలిన్, లూవీస్, మంగమ్మ, మరియ తదితరులు పాల్గొన్నారు.

దైద రవీందర్‌కు సన్మానం



రవీందర్‌ను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నకిరేకల్ : టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన దైద రవీందర్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్ డిస్ట్రిక్ ప్రతినిధులు డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, కందాల పాపిరెడ్డి, ఆశ్రమ ట్రస్ట్ చైర్మన్ ఎస్.రాంమోహన్‌రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిచేనేపల్లి ప్రకాష్‌రావు, ప్రతినిధులు రాంరెడ్డి, సతీష్, శంభులింగారెడ్డి, శ్రీనివాస్‌లు, సదానందం, సంతోష్, నారయణరెడ్డి, కృష్ణారెడ్డి ,మురళి, వాసు, చందు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

లో లెవల్ వంతెనలతో ఇక్కట్లు

- బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరద
- వరద ఉధృతితో వాహనాల రాకపోకలకు అంతరాయం
- హై లెవల్ వంతెనలు నిర్మించాలని కోరుతున్న ప్రజలు



కేతేపల్లి నుంచి మూసీకి వెళ్లే దారిలో వంతెన మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

కేతేపల్లి : మండలంలోని పలు గ్రామాల మధ్య వాగులపై నిర్మించి లో లెవల్ బ్రిడ్జిలతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాలు వచ్చినపుడు రాకపోకలకు ఆటంకం లేకుండా చెరువుల అలుగుల నుంచి, వాగుల నుండి వరద నీరు వెళ్లేందుకు వీలుగా మండలంలోని కొర్లపహాడ్- ఇప్పలగూడెం, గుడివాడ-మేడిపల్లిగూడెం, కేతేపల్లి- కొత్తపేట, కొత్తపేట-కాసనగోడు, కొప్పోలు- భీమారం , తుంగతుర్తి-చెర్కుపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై లోలెవల్ బ్రిడ్జిలు నిర్మించారు. ముందు చూపు లేకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తు పల్లాలను పట్టించుకోకుండా ఈ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడంతో వరద ఉధృతి ఎక్కువైనపుడల్లా ఇక్కట్లు తప్పటం లేదు. కొద్దిపాటి వర్షానికే బ్రిడ్జిలపై నుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో వరదులు వచ్చినప్పుడల్లా ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి. ఇదిలా ఉండగా రోడ్డు వెడల్పు చిన్నగా ఉండటం, వాహనాలు తిరిగి వెళ్లడానికి వీలు కాకపోవడంతో వరద ఉధృతి తగ్గే వరకు అక్కడే ఉండాల్సిన పరస్థితిలు నెలకొన్నాయి. వరద ప్రవాహాన్ని అంచనా వేయలేక బ్రిడ్జిపై నుంచి దాటే ప్రయత్నంలో పలువురు గల్లంతు కాగా వాహనాలు నీటి ప్రవాహంలో కొట్టుకపోయిన ఘటనలు ఉన్నాయి. గతంలో కేతేపల్లి- కొత్తపేట గ్రామాల మధ్య ఉ న్న బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీటిని బైక్‌పై దాటే ప్రయత్నంలో కాసనగోడు గ్రామానికి చెందిన భార్య, భర్తలు కొట్టుకపోయారు. భర్త అతికష్టం మీద భయటపడి ప్రాణాలు దక్కించుకోగా భార్య వరదలో కొట్టుకుపోయి మృతిచెందింది. గుడివాడ-నోముల మధ్య వరద ఉధృతికి కారు గల్లంతయింది.



గుడివాడ - మేడిపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

విద్యార్థులకు, కార్మికులకు ఇబ్బందులు

మండల కేంద్రం కేతేపల్లి - కొత్తపేట గ్రామాల మధ్య మూసీ కుడి కాల్వ పక్కన ఉన్న బ్రిడ్జి లెవల్ మరీ చిన్నదిగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే వరదనీరు బ్రిడ్జిపై నుంచి వెళ్తుంది. దీంతో చదువుల కోసం వెళ్లే బొప్పారం, కాసనగోడు, గుడివాడ, కొత్తపేట గ్రామాల విద్యార్థులు, వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే ప్రజలు వరద వచ్చినన్ని రోజులు ఇంటికే పరిమితం అవుతున్నారు. ఆయా గ్రామాల నుంచి పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, ఉపాధి పనులకు వెళ్లే కూలీలు సైతం విధులు హాజరు కాలేకపోతున్నారు. అధికారులు స్పందించి లో లెవల్ వంతెనల ఎత్తు పెంచి తమ ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం



వాగులపై నిర్మించిన వంతెనలు తక్కువ ఎత్తులో ఉండటంతో భారీ వర్షాలు కురిస్తే వరదనీరు వంతెనలపై నుంచి ప్రవహిస్తుంది. వరద ప్రవాహం తగ్గేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో రాకపోకలకు అంతరాయం తప్పడం లేదు. వంతెనల ఎత్తును పెంచి ప్రయాణికుల కష్టాలు దూరం చేయాలని ఎన్నిమార్లు విన్నవించినా పాలకులు పట్టించుకోవడం లేదు.

– పి. జానకిరాములు, కొత్తపేట

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



నకిరేకల్ : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్

నకిరేకల్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను లోక్‌అదాలత్ ద్వారా రాజీపడి సత్వర పరిష్కారం పొందవచ్చని నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల సూర్యవర్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా నకిరేకల్‌లోని మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా ఒకరు ఓడిపోవడం, మరోకరు గెలవడం కాదని ఇరు వర్గాల వారు గెలిచినట్లు అవుతుందన్నారు. నకిరేకల్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్ క్రిమనల్, సివిల్ , చెక్‌బౌన్స్ కేసుల గురుంచి వివరించారు. ఈ లోక్‌అదాలత్‌లో 76క్రిమినల్ కేసులు, 3 సివిల్, 31 జరిమానా, మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తున్నవి 660, ఇతర కేసులు 120 పరిష్కరించారు. ఇతర మొత్తం జరిమానాలు రూ.9,73,610 విధించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నకిరేకల్, శాలిగౌరారం సీఐలు రాజశేఖర్, కొండల్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంభయ్య, న్యాయవాదులు నోముల గోవిందరాజులు, సూదిని శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, కొమరయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ఎస్ఆర్ విద్యార్థినికి నీట్‌లో 100వ ర్యాంక్



ప్రియాంక

నల్లగొండ : నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణం చర్లపల్లిలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థిని బచ్చు ప్రియాంక ఆలిండియా స్థాయిలో 100వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల జోనల్ ఇన్‌చార్జ్ దోనాల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రియాంకను సన్మానించారు. నల్లగొండ బ్రాంచ్‌లో నీట్ చదివిన 22మంది లో 10మంది మెడికల్ సీట్లు సాధించినట్లు ఆయన తెలిపారు. మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపాల్స్ మనోజురెడ్డి , డీఎస్. కిశోర్ బాబు, ఏఓ సరితా రెడ్డి, వర్ధన్, ప్రసన్న ,శ్రీనివాస్, శోభలు ఉన్నారు.

బస్సులో పోగొట్టుకున్న పర్సు బాధితురాలికి అప్పగింత



బాధితురాలికి పర్సు అప్పగిస్తున్న కండక్టర్ వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల, మిర్యాలగూడ టౌన్ : బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన పర్సును తిరిగి ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు కండక్టర్. వివరాలు.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామానికి చెందిన భీమవరపు మౌనిక శుక్రవారం మిర్యాలగూడ బస్టాండ్‌లో కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ఎక్కి నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో దిగింది. ఆమె తన పర్సును బస్సులోనే మర్చిపోయింది. కండక్టర్ వెంకటేశ్వర్లు పర్సును గుర్తించి పరిశీలించగా.. అందులో సెల్‌ఫోన్‌తో పాటు రూ.1320 నగదు ఉండటంతో మిర్యాలగూడ డిపోలోని విచారణ కేంద్రంలో అప్పగించారు. బాధితురాలికి సమాచారం ఇచ్చి శనివారం పర్సును ఆమెకు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న కండక్టర్ వెంకటేశ్వర్లును డిపో మేనేజర్ రాంమోహన్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు.

దివీస్ లేబొరేటరీ యాజమాన్యానికి సన్మానం



దివీస్ లేబొరేటరీ ప్రతినిధులను సన్మానిస్తున్న గవర్నర్

నల్లగొండ : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లాలో రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌కు 2వేల మందితో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రక్తదానం చేయించిన దివీస్ లేబొరేటరీ(చౌటుప్పల్) యాజమాన్యాన్ని హైదరాబాద్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శాలువా కప్పి షీల్డు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, దానకిషోర్, శ్రీరాములు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



కట్టంగూర్‌లో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అన్నారు. కట్టంగూర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే కట్టంగూర్ ప్రీమియర్ లీగ్–1 ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శనివారం కట్టంగూర్‌లో ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శరీర ధారుడ్యం పెంపొందుతుందన్నారు. యువత క్రీడా పోటీల్లో రాణించాలన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ్మ, మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, గద్దపాటి దానయ్య, మత్రి రాజు, ఐతగోని సైదులు, గుండు పరమేశ్, సోమేశ్వర్ తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌కు నోటీసులివ్వడం కక్షసాధింపు చర్యలే

మర్రిగూడ : ఫార్ములా ఈ-కార్ రేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌కు నోటీసులివ్వడం, కేసులు పెట్టడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలో భాగమేనని మాజీ ఎంపీటీసీ ఊరిపక్క సరితానగేష్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఫార్ములా ఈ-కార్ రేసు ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు తెలిపారు. కాని ఇప్పుడు ఆ ప్రయోజనాలను నాశనం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇకనైనా ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

శ్మశానవాటికలో నీటి వసతి కరువు



మునుగోడు శ్మశాన వాటికలో నీటి సౌకర్యం లేక ట్యాంక్‌లో నీరు కొనితెచ్చుకున్న ప్రజలు

మునుగోడు : ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి గ్రామాల్లో శ్మశాన వాటికలు నిర్మించినా ఎంలాటి ఉపయోగం లేకుండా పోతున్నాన్నాయి. అందుకు ప్రత్యేక నిదర్శనం నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో శ్మశానవాటిక ఉపాధిహామి పథకం నిధులు రూ.12.50లతో మౌలిక వసతులతో ఏర్పాటు చేశారు. మృతదేహాలను దహనం చేసేందుకు అవసరమైనా ఫ్లాట్ ఫామ్‌తో పాటు పిండాలు పిట్టలకు రెండు గద్దెలు, అనంతరం స్నానాలు చేసేందుకు చేసేందుకు స్త్రీలకు, పురుషులకు వేర్వేరుగా గదులు నిర్మించారు. కానీ అందుకు అవసరమైన నీటి సౌకర్యం కల్పించకపోవడంతో ఆ గ్రామ ప్రజలు అవసరమైయినప్పుడు రూ.1500లు ఖర్చు చేసి నీటి ట్యాంకర్ తెప్పించుకొని స్నానాలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం రూ.లక్షల ఖర్చు చేసి నిర్మించినా శ్మశానవాటికలు ఉపయోగపడకుండా పోతున్నాయని పలువురు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితి మరికొని గ్రామాల్లో కూడా నెలకొని ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని నీటి సౌకర్యం లేని శ్మశానవాటికలకు నీటి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

తెలంగాణ సాంస్కృతిక కళాజాతా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : జూలై 5న పట్టణంలోని కళాభారతిలో నిర్వహించే తెలంగాణ సాంస్కృతిక కళాజాతా పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర కళాకారులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర ఎనలేనిదన్నారు. అదేవిధంగా తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్ మాట్లాడుతూ జూలై 5న కళాభారతిలో నిర్వహించే కళాజాతకు రాష్ట్ర వ్యాప్తంగా కళాకారులు హాజరువుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దారం మల్లేష్‌యాదవ్, కందుకూరి సుదర్శన్, ఆదిమల్ల ఎల్లయ్య, రెమడాల శ్రీనివాస్, సత్యనారాయణ, వేణు, నల్ల శ్రీనివాస్, కందుల సైదులు, గద్దగ నగేష్, ఎల్లేష్ పాల్గొన్నారు.



నల్లగొండలోని టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన విద్యా ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన సదస్సులో మాట్లాడుతున్న బీసీ ఐఎఫ్ రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు

యోగా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



యోగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ఎంవీఆర్ పాఠశాలలో జూన్ 21న నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం–2025 కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం .నాగరాజు శనివారం పట్టణంలో ఆవిష్కరించారు. అనంతరం జిల్లా సివిల్ కోర్టు జడ్జి సౌందర్య, డీఎస్పీ శివరాంరెడ్డికి కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, పతాంజలి యోగా సమితి అధ్యక్షకార్యదర్శులు నాగులపల్లి శ్యాంసుందర్, జల్లెల్లి వెంకటేశ్‌యాదవ్, యోగా గురువులు మేకల కరుణాకర్ ఆచార్య, శివ ఆచార్య, పున్న వెంకటేశ్వర్లు ఆచార్య, కోట్ల సైదులు ఆచార్య, కంది భజరంగ్ ప్రసాద్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్

నల్లగొండ : పట్టణంలోని 47వ వార్డులో ప్లాటు ఉండి ఇళ్లు నిర్మించుకోనున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీండిగ్ ఇవ్వనున్నట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ తెలిపారు. ఆయన శనివారం వార్డులో ప్లాట్ ఉండి ఇళ్లు నిర్మించుకోనున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేసి మాట్లాడారు. ఇది మొదటి విడత మాత్రమే అని, ఎవరైనా ప్లాటు ఉండి ఇళ్లు నిర్మించుకోదల్చిన వారు తనను కాని, వార్డు ఆఫీసర్‌ను కాని సంప్రదించాలని ఆయ న తెలిపారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితాను ఆయన వినిపించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రష్మి, మునాసుప్రసన్న, వీరారెడ్డి, నవీన్, ప్రదీప్, రాజు, వినయ్, లతీఫ్, జానీ, నజీర్, పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్

నల్లగొండ టౌన్ : లేబర్ కోడ్స్‌ను రద్దు చేసేవరకు మోదీ ప్రభుత్వంపై కార్మికవర్గం సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ తెలిపారు. శనివారం నల్లగొండ దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 9 దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో చినపాక లక్ష్మీనారాయణ ,డబ్బికారు మల్లేష్, ప్రమీల, ఎండి సలీం, అవుత సైదులు, దండెంపల్లి సత్తయ్య, మల్లు గౌతమ్ రెడ్డి, చింతపల్లి బయన్న, నల్లా వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, కానుగు లింగస్వామి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి రాములు మృతి

- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



రాములు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : నకిరేకల్ పట్టణానికి చెందిన ప్రముఖుడు, వాస్తు ప్లానర్, కోపరేటివ్ బ్యాంక్ రిటైర్డు సూపర్‌వైజర్ పోతుల రాములు(70) గుండెపోటుతో శక్రవారం రాత్రి కన్నుమూశారు. రాములు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. సూర్యాపేటలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలలో డయాలసిస్ చేయించుకునేందుకు శుక్రవారం ఉదయం వెళ్లారు. ఆస్పత్రిలో ఉన్న రాములుకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో రాత్రి 11 గంటల సమయంలో మృతిచెందారు. తాటికల్ శివారులోని లయన్స్ వృద్ధాశ్రమం భవనం కోసం తన సొంతంగా 400 గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. రాములు మృతదేహన్ని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో మున్సిపల్ చైర్ పర్సన్ చౌగోని రజితా, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, ట్రస్ట్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పాపిరెడ్డి, రిటైర్డు ఉద్యోగుల సంఘ నేత పోతుల వెంకటనారయణ, వివిధ దేవాలయల చైర్మన్లు, లయన్స్ క్లబ్ ఇతర సంఘాల నాయకులు ఉన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని శంకర గోశాలలో ప్రహల్లాద వరదలక్ష్మి నరసింహస్వామి వార్షికోత్సవం సందర్భంగా శనివారం శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్థాపిత దేవతపూజలు, కుంభాభిషేకం, అలంకరణ, బలి ప్రదానం, పూర్ణాహుతి, కుంభోద్వాసన వేదపండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీనివాస్, భాస్కర్, నాగరాజు, బి. శ్రీనివాసు, గిరి, ప్రవల్లిక, అర్చకులు ఫణీంద్రశర్మ, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బాల్య వివాహాలను అరికడదాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ శివతేజ

కేతేపల్లి : బాల్య వివాహాల అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేతేపల్లి ఎస్ఐ శివతేజ అన్నారు. బాల్య వివాహాల నిర్మూలణపై అశ్విత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను శనివారం స్థానిక ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంస్థ ప్రతినిధులతో కలసి ఆవిష్కరించి మాట్లాడారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థల నిర్మూలణపై అశ్విత స్వచ్ఛంద సంస్థ ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.కవిత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం కురిస్తే రోడ్డంతా జలమయం



నాంపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నాంపల్లి : కాస్త వర్షం పడితే చాలు నాంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై గుంతల్లో నీరు నిలుస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాంపల్లి మండల కేంద్రం నుంచి గుర్రంపోడ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు అంబేద్కర్ చౌరస్తా వద్ద నుంచి సుమారు నాలుగు వందల మీటర్ల సీసీ రోడ్డు ఉంటుంది. ఈ రోడ్డంతా గుంతలమయంగా ఉంది. వర్షం వచ్చినప్పుడు రోడ్డుపై నీరు నిలవడంతో గుంతలు కనిపించక వాహనాదారులు ప్రమాదానికి గురై గాయాలపాలవుతున్నారు. ఈ రోడ్డుకు కనీసం మరమ్మతులు చేసేవారే కరువయ్యారని మండల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శికి, నాంపల్లి ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.